సాక్షి రంగారెడ్డి

శనివారం । 20 । ఏప్రిల్ । 2024


ఆలయంలోకి వెళ్లేందుకు గోడ ఎక్కుతున్న మహిళ


భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్


గరుడ ప్రసాదం కోసం ఎండలో వేచి చూస్తున్న మహిళలు

గరుడ ప్రయాస


ఎండ వేడి తట్టుకోలేక..





పోటెత్తిన చిలుకూరు

- ప్రసాదం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్
- నాలుగైదు కిలోమీటర్ల దూరం నుంచి కాలినడక
- క్యూలైన్లలో తోపులాట.. సొమ్మసిల్లిన పలువురు మహిళలు
- సరైన ఏర్పాట్లు లేక తీవ్ర ఇబ్బందులు
- ప్రసాదం దొరక్క సగం మందికి తప్పని నిరాశ

మొయినాబాద్: తెలంగాణ తిరుపతి.. వీసా దేవుడిగా పేరొందిన చిలుకూరు బాలాజీ ఇప్పుడు సంతాన ప్రాప్తి దేవుడిగా మారాడు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణ అనంతరం గరుత్మంతునికి నైవేద్యంగా పెట్టే గరుడ ప్రసాదాన్ని సంతానం లేని మహిళలు స్వీకరిస్తే సంతానం కలుగుతుందని ఆలయ అర్చకులు ప్రచారం చేయడంతో శుక్రవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు లక్ష మంది గరుడ ప్రసాదం కోసం రాగా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో చాలామంది తమ వాహనాలను రోడ్డు పక్కనే పార్కుచేసి నాలుగైదు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్లలో ఉన్నా చాలా మందికి ప్రసాదం దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి..

బ్రహ్మోత్సవాల సందర్భంగా సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం పంపిణీ చేస్తామని ఆలయ అర్చకుడు రంగరాజన్ కొన్ని రోజులుగా చెబుతూ వచ్చారు. ఇది సోషల్ మీడియాలో బాగా వైరల్ కావడంతో భక్తులు పోటెత్తారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ కొనసాగింది. చిలుకూరుకు వచ్చే భక్తులతోపాటు నగరం వైపు వెళ్లే వాహనదారులు, పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, చేవెళ్ల వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం తరువాత రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డితోపాటు పలువురు సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

తాగునీటికి తిప్పలు

సరైన నీటి వసతి లేక భక్తులకు తిప్పలు తప్పలేదు. ఆలయం తరపున ఒక వాటర్ ట్యాంకర్ పెట్టినా అది ఒకే చోట ఉండిపోయింది. ఆలయం వద్ద ఉన్న షాపుల్లోని వాటర్ బాటిల్స్ పూర్తిగా అయిపోయాయి. మధ్యాహ్నం చాలా మందికి మంచినీళ్లు దొరకలేదు. కొంత మంది కులాయిల్లో, స్థానికుల ఇళ్లలో నీళ్లు అడిగి తీసుకుని తాగారు.

కనుల పండువగా ధ్వజారోహణం

బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. గరుత్మంతునికి, ధ్వజస్తంబానికి అభిషేకం నిర్వహించి తిరుమల కిరణాచారి, పరావస్తు రమాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గరుత్మంతుని పటాన్ని పల్లకిలో ప్రతిష్ఠించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య ధ్వజస్తంభానికి ఆవిష్కరించారు. నవకలశ స్నాపకం, గరుత్మంతుని ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. తరువాత గరుడ పటానికి నాలుగు దిక్కుల గరుత్మంతుని రూపాలు ప్రతిష్ఠించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నర్సింహాచార్యులు, కిట్టు, కృష్ణమూర్తి, కన్నయ్య, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి గోప వాహన, హనుమంత వాహన సేవలు అందించనున్నారు.

తీవ్ర ఇబ్బందులు


ట్రాఫిక్ జాం కావడంతో కాలినడకన..

సుమారు మూడు నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుని, ఎండలో కాలినడకన ఆలయానికి చేరుకున్న భక్తులకు సరైన ఏర్పాట్లు లేక మరింత ఇబ్బందిపడ్డారు. అపసోపాలు పడి ఆలయానికి చేరుకోగా మహిళలను మాత్రమే లోనికి అనుమతించడంతో పురుషులు, ఇతర భక్తులు ఆలయం బయటే ఉండిపోయారు. క్యూలైన్లలో రెండు మూడు సార్లు తోపులాటలు జరగడంతో పలువురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కొంత మంది ఆలయం గోడలు ఎక్కి లోనికి వెళ్లారు.

సగం మందికే ప్రసాదం..

ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. ఆ తర్వాత ప్రసాదం అయిపోవడంతో సగం మంది మహిళలకు అందలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. కొందరు ఆలయ అర్చకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణంలో బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు.

ఏర్పాట్లు సరిగా లేవు



సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం ఇస్తారని తెలియడంతో ఇక్కడికి వచ్చాం. భారీగా ట్రాఫిక్ జాం కావడంతో ఇబ్బందులు పడుతూ ఆలయానికి చేరుకున్నాం. గరుడ ప్రసాదానికి ఎక్కడి నుంచి వెళ్లాలి. ఎక్కడ ప్రసాదం ఇస్తున్నారో చెప్పేవారేలేరు. ఏర్పాట్లు చేయనప్పుడు ప్రసాదం కోసం రావాలని ప్రచారం చేయడమెందుకు?

– సంధ్య, భక్తురాలు, బంజారాహిల్స్


గరుడ ప్రసాదం కోసం ఎగబడుతున్న మహిళలు

ప్రసాదం దొరకలేదు



సంతానం లేని మహిళలకు ప్రసాదం ఇస్తారని సోషల్ మీడియాలో చూసి వచ్చాను. ఉదయం 6 గంటల నుంచే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాం. క్యూలైన్లోనూ అపసోపాలు పడుతూ ఆలయం లోపలికి చేరుకున్నాం. అప్పటికే ప్రసాదం అయిపోయిందని చెప్పారు. అంత దూరం నుంచి వచ్చి ప్రసాదం దొరక్కపోవడంతో నిరాశ చెందాను.

– అర్చన, భక్తురాలు, సిరిసిల్ల

న్యూస్‌రీల్

రెండో రోజు.. మూడు నామినేషన్లు


బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని తరపున..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ స్థానానికి శుక్రవారం రెండో రోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు గురువారం మూడు నామినేషన్లు దాఖలు కాగా, ఇప్పటి వరకు మొత్తం సంఖ్య ఆరుకు చేరింది. బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎంసీపీఐ (యూ) అభ్యర్థిగా వనం సుధాకర్, ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థిగా మహమ్మద్ చాంద్ పాషా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి స్వయంగా చేసుకుని నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తరపున ప్రతిపాదకులు మేకల భిక్షపతి నామినేషన్ వేశారు.

ఎన్నికల వేళ పట్టుబడుతున్న నగదు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 757 చోట్ల తనిఖీలు నిర్వహించారు. వీటిలో రూ.7,32,95,639 విలువ చేసే నగదు సహా మద్యం, ఇతర వస్తువులు పట్టుబడినట్లు జిల్లా రిటర్నింగ్ ఆఫీసర్ శశాంక వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులకు పట్టుబడిన దానిలో రూ.2,88,74,708 నగదు సహా రూ.4,18,700 విలువ చేసే 5.30 కేజీల వెండి, రూ.29,60,637 విలువ చేసే చీరలు, ఇతర వస్తువులు, రూ.75,56,393 విలువ చేసే 13,554.3 లీటర్ల మద్యం ఉన్నాయి. రూ.3,31,89,901 విలువ చేసే డ్రగ్స్ సహా రూ.2,95,300 విలువ చేసే ఇతర వస్తువులు పట్టుబడినట్లు ఆయన వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం


మంటలు అంటుకుని దగ్ధమవుతున్న కారు

మొయినాబాద్: షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ఓ కారు దగ్ధమైంది. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గేటు సమీపంలో శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం గుండాలకు చెందిన మల్కు సుధాకర్ ఇటీవల తన వ్యాగనార్ కారును నగరంలో సర్వీసింగ్‌కు ఇచ్చాడు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో నగరం నుంచి కారు తీసుకుని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఇంటికి వెళ్తుండగా మొయినాబాద్ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గేటు సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్ వద్దకు వెళ్లగానే షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. కారులో నుంచి పొగలు రావడంతో పక్కకు ఆపి సుధాకర్ దిగి చూశాడు. అప్పటికే మంటలు పెద్ద ఎత్తున చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రైతుల భూరికార్డుల పరిశీలన

యాచారం: లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన భూ న్యాయ శిబిరాల్లో వచ్చిన అర్జీలకు సంబంధించి రికార్డులను పరిశీలించి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతుల నుంచి భూరికార్డుల పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాచారం మండలాన్ని పైలెట్ కింద తీసుకుని పలు గ్రామాల్లో భూ న్యాయ శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో వివిధ రకాల భూ సమస్యలపై 2,075 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. రెండో విడతగా మళ్లీ సదస్సులు నిర్వహించి రైతులు ఇచ్చిన అర్జీలకు సంబంధించి వారి వద్ద ఉన్న రికార్డులను స్వీకరించి పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. రికార్డుల పరిశీలన అనంతరం రెవెన్యూ అధికారులతో సమావేశమై రైతుల భూ సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లీఫ్స్ సంస్థ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, రైతు బొగ్గుల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

అధికారులకు వ్యయ పరిశీలకుల సూచన


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు పని చేయాలని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్లా అధికారులను ఆదేశించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన వారు శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, ఇతర అధికారులతో కలిసి ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ.. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో చేసే ఖర్చులను ఏ విధంగా లెక్కిస్తున్నారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణలో అన్ని టీములు సమన్వయంతో పని చేయాలని, అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలని సూచించారు.

ప్రతిపైసా లెక్కించాల్సిందే..

ప్రచారానికి పార్టీ ద్వారా అభ్యర్థి తరపున ఖర్చు చేసే ప్రతి పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద జమ చూపెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతతో సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయభ్రాంతులకు గురి చేసినా, బలవంతంగా ప్రభావితం చేసినా సి–విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వొచ్చని చెప్పారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందన్నారు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే సి–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

ఎంసీఎంసీ పరిశీలన

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సెంథిల్ కుమారన్ శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. కంట్రోల్ రూమును పరిశీలించారు.

నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల ఎంసీసీ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల అధికారులకు భువనగిరి లోక్‌సభ వ్యయ పరిశీలకుడు, ఐఆర్‌ఎస్ అధికారి కుమార్ రాకేష్ రాజన్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఫ్లెయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, ఏఈఓ, వీడియో సర్వలెన్స్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కుమార్ రాకేష్ రాజన్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై నిరంతరం నిఘా పెట్టాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఖర్చుల కంటే ఎక్కువ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీది అభ్యర్థి ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘిస్తే పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యూడ్ కాల్.. బ్లాక్‌మెయిల్

కందుకూరు: ఓ యువకుడికి, ఓ యువతి నగ్నంగా వీడియో కాల్ చేసి.. తర్వాత బ్లాక్‌మెయిల్ చేసి నగదు దోచుకున్న సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ కథనం ప్రకారం వివరాలు.. మండల కేంద్రంలోని ఓ కిరాణా షాపు యజమాని(35)కి ఈ నెల 17న ఉదయం 9 గంటల సమయంలో గుర్తు తెలియని సెల్‌ఫోన్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. లిఫ్ట్ చేయగా అందులో ఓ యువతి నగ్నంగా మారి హిందీలో మాట్లాడింది. దీంతో అతను కొద్దిసేపటి తర్వాత కాల్‌ను కట్ చేశాడు. ఈ క్రమంలో ఈనెల 18న మధ్యాహ్నం మరోసెల్ నంబర్ 89186 00177 నుంచి వాట్సాప్ కాల్ చేసిన ఓ అజ్ఞాత వ్యక్తి నేను పోలీస్ అని చెప్పి.. నగ్నంగా ఉన్న మహిళతో నువ్వు మాట్లాడిన వీడియో నా దగ్గర ఉంది, యూట్యూబ్‌లో పెడతానని బెదిరించాడు. అలా చేయొద్దంటే రూ.30 వేలు పంపాలని డిమాండ్ చేయగా షాపు యజమాని ఆ నగదును, అతను చెప్పిన విధంగా పంపాడు. తర్వాత మళ్లీ మరికొంత నగదు కావాలని బ్లాక్‌మెయిల్ చేయడంతో బాధితుడు శుక్రవారం సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏదైనా సందేహం ఉంటే సైబర్ క్రైం కానీ, స్థానిక పీఎస్‌లో కాని ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

విజిలేస్తున్నారు!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై సి-విజిల్ యాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 80 ఫిర్యాదులు అందగా, వీటిలో ఇప్పటికే 61 ఫిర్యాదులను పరిష్కరించారు. శేరిలింగంపల్లిలో 33, ఎల్బీనగర్‌లో 19, మహేశ్వరంలో 11 ఫిర్యాదులు అందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంక వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాడ్గుల: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు మాడ్గుల సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కలకొండవాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్లు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్, సురేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



ఎండలు ఆవరించి.. రైతన్నకు వ్యథ మిగిల్చి

మండే ఎండలకు భూగర్భ జలాలు తగ్గడంతో బోర్లు వట్టిపోయి పంటలకు నీరు అందక వరి, మొక్కజొన్న చేన్లు ఎండిపోతున్నాయి. మండల పరిధిలోని బద్నాపూర్‌కు చెందిన అశోక్‌గౌడ్ తనకున్నా ఐదు ఎకరాలలో వరి వేశారు. బోరులో నీరు అడుగంటడంతో పంటను కాపాడుకునే మార్గంలేక ఇలా పశువులను మేపుతున్నారు. దాదాపు రూ.2 లక్షల మేర నష్ట పోయానని బాధిత రైతు వాపోయారు.

– తలకొండపల్లి

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఔటర్‌పై మహిళ దుర్మరణం

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగు రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనక నుంచి కారు ఢీకొని మహిళ దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలులోని బృందావన్ కాలనీకి చెందిన తల్లీ కూతురు మాలతి(50), మౌలిక శుక్రవారం కర్నూలు నుంచి కూకట్‌పల్లికి వచ్చారు. అక్కడ వీరు ఓ ఎలక్ట్రిక్ కారు అద్దెకు తీసుకుని పెద్దఅంబర్‌పేట్‌లోని ఆశ్రమానికి వెళ్లారు. అక్కడి నుంచి గచ్చిబౌలి తిరిగి వస్తూ ఔటర్ రింగు రోడ్డు మీద ప్రమాదానికి గురయ్యారు. హమీదుల్లానగర్ శివారులో ఔటర్‌పై ఆగి ఉన్న లారీని వెనక నుంచి వీరి కారు ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు సీట్లో ఎడమవైపు కూర్చున మాలతికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మౌలిక, కారు డ్రైవర్ నర్సింహారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. డ్రైవింగ్ సీటు వైపు ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిపాదించారు.. పాతరేశారు!

ఫార్మాసిటీ రోడ్డుకు గ్రహణం

- నిలిచిపోయిన శ్రీశైలం–నాగార్జునసాగర్ అనుసంధాన రహదారి పనులు
- నిధులు లేవంటున్న టీఎస్‌ఐఐసీ
- పరిహారం న్యాయంగా ఉండాలంటున్న రైతులు

యాచారం: ఫార్మాసిటీ రోడ్డు పనులకు గ్రహణం పట్టింది. గత సర్కార్ హయాంలో రూ.వంద కోట్లకు పైగా నిధులతో శ్రీశైలం హైవే కందుకూర్ మండల కేంద్రం నుంచి నాగార్జునసాగర్ హైవే యాచారం మండల కేంద్రం వరకు వంద అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టారు. రెండు ప్రధాన రహదారులను అనుసంధానం చేయడంతో సమీపంలో ఏర్పాటు చేసే ఫార్మాసిటీకి రవాణా మెరుగవుతుందన్నది సర్కార్ ప్రతిపాదన. రోడ్డు విస్తరణలో పోయే భూములకు పరిహారం చెల్లింపులో అధికారులు సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు మోకాలడ్డారు. మొదట రైతులు అనుకూలంగా ఉన్నప్పటికీ పరిహారం చెల్లింపు న్యాయంగా ఉంటే భూములు ఇస్తామని పేర్కొన్నారు. కానీ అప్పటి అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోగా, భూ సేకరణపై రైతులను బెదిరించారు. దీంతో అధికారులపై తిరుగుబాటు చేశారు. అధికారులు సైతం రైతులపై కేసులు పెట్టడంతో రోడ్డు విస్తరణ ముందుకు సాగలేదు.

మరమ్మతులకు రూ.రెండున్నర కోట్లు

టీఎస్‌ఐఐసీ(రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ) నుంచి మంజూరు చేసే రూ.వంద కోట్లకు పైగా నిధుల్లో మీరాఖాన్‌పేట–యాచారం, నందివనపర్తి–నక్కర్తమేడిపల్లి గ్రామాల మధ్యన రోడ్డు వెడల్పు మరమ్మతుల పనులకు దాదాపు రూ.రెండున్నర కోట్లకు పైగానే ఖర్చు చేశారు. టీఎస్‌ఐఐసీ నిధులతో రోడ్డు భవనాల శాఖ పర్యవేక్షణలో ఈ రోడ్డు వెడల్పు పనులను రెండేళ్ల కిందటే ప్రారంభించారు. కానీ నేటికీ నత్తనడకన సాగుతున్నాయి.

అయోమయంలో రైతులు

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీపై చేసిన ప్రకటనలు రైతులను అయోమయానికి గురి చేశాయి. ఓసారి రద్దు చేస్తామని.. మరోసారి తరలిస్తామని వెల్లడించింది. దీంతో రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసే టీఎస్‌ఐఐసీ సైతం వెనక్కి తగ్గింది. ఫలితంగా విస్తరణ పనులు నిలిపేశారు. భూములు ఇవ్వడానికి అనుకూలంగా ఉన్న రైతులు మౌనంగా ఉంటున్నారు. మీరాఖాన్‌పేట నుంచి యాచారం వరకు 12 కిలోమీటర్లు, నందివనపర్తి నుంచి నక్కర్తమేడిపల్లి వరకు మూడు కిలోమీటర్ల వంద అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలన్నది అప్పటి సర్కార్ నిర్ణయం.



నందివనపర్తి-నక్కర్తమేడిపల్లి మార్గంలో నిర్మించి వదిలేసిన కల్వర్టు

అక్కడ కళకళ.. ఇక్కడ వెలవెల

రెండేళ్ల కిందట ప్రారంభించిన ఫార్మాసిటీ రోడ్డు విస్తరణ పనులు మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండల కేంద్రం నుంచి మీరాఖాన్‌పేట వరకు చురుగ్గా సాగాయి. శ్రీశైలం హైవే నుంచి మీరాఖాన్‌పేట వరకు దాదాపు 12 కిలోమీటర్ల మేర వంద అడుగుల రోడ్డు పనులు చకచక పూర్తి చేశారు. కానీ మీరాఖాన్‌పేట నుంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలం నాగార్జునసాగర్ హైవే వరకు రోడ్డు విస్తరణ ముందుకు సాగలేదు.

ఆరు ఎకరాలు పోతుంది



రోడ్డు వెడల్పులో భాగంగా నందివనపర్తిలో మా కుటుంబ సభ్యులకు చెందిన ఆరు ఎకరాల వ్యవసాయ భూమి పోతుంది. ప్రస్తుతం అక్కడ ఎకరా రూ. రెండు కోట్లకు పైగానే ధర పలుకుతుంది. రైతులు అప్పట్లో ఎకరాకు రూ.50 లక్షలు అడిగారు. పరిహారం చెల్లింపులో అధికారులు నిర్ణయం తీసుకోలేదు. రోడ్డు వెడల్పును ఎవరూ వ్యతిరేకించలేదు.

– బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, నందివనపర్తి

నిధులు మంజూరు చేయిస్తా



మీరాఖాన్‌పేట–యాచారం గ్రామాల మధ్యన రోడ్డు వెడల్పు పనులు నిలిచిపోవడంపై టీఎస్‌ఐఐసీ అధికారులతో మాట్లాడుతా. శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేలకు ఈ రోడ్డు ఎంతో ముఖ్యమైంది. స్థానికులు సైతం నా దృష్టికి తెచ్చారు. ప్రభుత్వంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తా.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

21న జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

లక్ష్మీకాపూల్: రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 7గంటల నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 12 ఏళ్ల పైబడిన వారికి పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఈ.గోపి తెలిపారు. ఇందులో అండర్ 14, 16, 18, 20, మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో 100, 600, 800, 1500, 2000, 5000 మీటర్ల పోటీలు ఉండనున్నాయి. ఈ పోటీలోని విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పాన సాయిరెడ్డి(97038 38987)ని సంప్రదించాల్సిందిగా కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎంపీపటేల్‌గూడ విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాల ముందు రోడ్డు పక్కన ఓ వ్యక్తి పడిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మరణించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించగా మెదక్‌జిల్లా అల్లాదుర్గం మండలం పెద్దపూర్‌కు చెందిన కర్రె ముత్తయ్య(54)గా గుర్తించారు. బతుకుదెరువు కోసం వచ్చాడని ఇక్కడికి వచ్చాడని వివరించారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వడదెబ్బకు మరణించాడా, లేక ఇతర ఏవైన కారణాలు ఉన్నాయా అని పోలీసులు విచారిస్తున్నారు.

యువకుడి ఆచూకీ కోసం గాలింపు

కొందుర్గు: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేసిన యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సోషల్ మీడియాలో పోస్టు చేసిన మొబైల్ నెట్‌వర్క్ ఆధారంగా పోలీసులు విచారణ చేయగా శుక్రవారం మధ్యాహ్నం నగరంలోని చాదర్‌ఘట్‌లో బుడ్డోని రాజు ఫోన్ ఉన్నట్లు తెలిసింది. అయితే ఆ ప్రాంతంలో అతడి ఉన్నట్లు ఆచూకీ లభించలేదు. కాగా అతడి మోటార్ సైకిల్ మాత్రం గురువారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఫుట్‌వేర్ ఎదుట పార్కింగ్ చేసి ఉంది. వీడియో వైరల్ కావడంతో రాజు కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. అతడి ఆచూకీ తెలుసుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

దీర్ఘకాలిక సెలవులు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న వారు తమ సెలవులను రద్దు చేసుకొని వెంటనే ఎన్నికల విధులకు హాజరు కావాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలిక సెలవులతో పాటు, విదేశీ ప్రయాణాల కోసం శాఖల అనుమతులు తీసుకున్న వారు కూడా ఎన్నికల విధుల్లోకి రావాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల విధుల్లో భాగంగా పీఓ, ఏపీఓ, ఇతర పోలింగ్ సిబ్బంది నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బందికి కొరత ఏర్పడిన దృష్ట్యా ప్రతి ఒక్కరు విధులకు హాజరు కావాలన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దీర్ఘకాలిక సెలవులతో పాటు, విదేశాలకు వెళ్లేందుకు కూడా సెలవులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

స్వార్థపరులు పార్టీ వీడినా నష్టం లేదు



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన వాదే సాల్హెహీన్ బస్తీ వాసులు

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన బస్తీవాసులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే సాల్హెహీన్ బస్తీకి చెందిన ముస్లింలు శుక్రవారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. మున్సిపాలిటీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హామెద్, అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్‌ల ఆధ్వర్యంలో బస్తీ వాసులు ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపు ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంత మంది స్వార్థంతో పార్టీని వీడినప్పటికీ నష్టమేమిలేదన్నారు. మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలు వెచ్చించి చేసిన అభివృద్ధి పనులను చూసిన ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్‌ని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజద్ ఖాన్, సయ్యద్ ఫెరోజ్, మన్నాన్, అబ్దుల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థిపై భూ కబ్జా కేసు

- న్యాయస్థానం ఆదేశంతో కేసు నమోదు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై ఆదిబట్ల పీఎస్‌లో భూకబ్జా కేసు నమోదైంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా, పెద్ద అడిషర్లపల్లి మండలం, పెర్వాల గ్రామానికి చెందిన కంచర్ల రాధిక, ఆమె భర్త యాదగిరిరెడ్డి తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడ సర్వే నంబర్ 500,501లోని ప్లాట్ నంబర్ 65లో 200 గజాల స్థలాన్ని 2015లో కొనుగోలు చేశారు. అప్పట్లోనే స్థలం హద్దుల మేరకు కడీలు పాతి వదిలేశారు. ఇదిలా ఉండగా.. గత ఫిబ్రవరి 17న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,చామర్తి మారుతి రవిశంకర్ అనే ఇద్దరు వ్యక్తులు.. రాధిక దంపతుల ప్లాట్‌తోపాటు దక్షిణం వైపున్న రోడ్డును ఆక్రమించి ప్రీకాస్టు కాంపౌండ్ వాల్ నిర్మించారు. మాకు రాజకీయ అండదండలు ఉన్నాయి.. మమ్మల్ని ఏమీ చేయలేదరని బెదిరించారు. దీంతో సదరు మహిళ ఇబ్రహీంపట్నం కోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు ఈ నెల 13న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చామర్తి మారుతి రవిశంకర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ భేటీ

పార్టీ మారే నిర్ణయంపై చర్చలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సన్నాహాలను పూర్తి చేసుకున్నారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం తన నివాసంలో ముఖ్య అనుచరులు, నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు గల కారణాలు తదితర వాటిపై చర్చించారు. ముఖ్య అనుచరులు, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాన్ని ఆయన స్వీకరించారు. నాయకులు పార్టీలోకి చేరేందుకు సానుకూలంగా మాట్లాడటంతో ఆయన పార్టీ మారేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రెండుసార్లు సమావేశమయ్యారు. శనివారం లేదా ఆదివారం పార్టీలో చేరేందుకు తగు ఏర్పాట్లను చేస్తున్నారు. దాదాపు 2 గంటల పాటు సమావేశమైన అనంతరం తన అనుచరులకు పార్టీ మారిన అనంతరం తగు ప్రాధాన్యం ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. అందరితో కలుపుకుపోయేందుకు నిర్ణయించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ గాలం!

సాక్షి, సిటీబ్యూరో: రాజేంద్రనగర్ శాసనసభ్యుడు ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఈమేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి జంప్ కాగా.. తాజాగా ఆయనను ప్రకాశ్‌గౌడ్ అనుసరిస్తున్నారు. మరోవైపు వీరువురి బాటలోనే మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ కాంగ్రెస్‌లో చేరే అవకాశమున్నట్లు తెలుస్తోంది. పార్ల మెంటు ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలని భావిస్తున్న పీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలపై పట్టు బిగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే సిటీ ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్నారు. ఈ క్రమంలోనే వారం రోజుల వ్యవధిలోనే నలు గురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించే అవకాశంలేక పోలేదనే ప్రచారం జరుగుతోంది. కాగా సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి సహా చేవెళ్ల లోక్‌సభస్థానాలను సీరియస్‌గా తీసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రెండు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ గెలిచి తీరాలని పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే చేరికలు సాగుతున్నట్లు తెలుస్తోంది.



నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్